కథా నిలయం
3655
శ్రీకాకుళం

# జవాబులేని ప్రశ్న

ఇంకా చాలా దూరం నడవాలి. కాళ్ళు లాగుతున్నాయి. మదుం మీద కూర్చున్నాడు.

ఒక కప్పు టీ గాని, నీళ్ళుగానీ తాగితే బాగుండునుగాని కొట్లన్నీ మూసేసేరు. చీకటి మింగిన రాత్రి కాళసర్పంలా వుంది. పగలంతా పనిచేసి అలసిపోయిన శ్రమజీవులు రేపటి వుదయమిచ్చే మిధ్యా వాగ్దానాలని నెమరువేస్తూ హాయిగా నిద్ర పోతున్నారు. పాపం పిచ్చివాళ్ళు!

దూరంగా రోడ్డువైపు ఒక వెలుగు కనిపించింది. అది మెల్లమెల్లగా మదుం వైపే వస్తున్నట్లుంది. బహుశా ఏదైనా టీ బండేమో!

జేబు తడిమి చూసాడు. అది ఖాళీ; రెండు రోజులైంది, పదిపైసలైనా సంపాదించలేదు.

కొత్తవలస సంతగదా, నాలుగు డబ్బులొస్తాయని బయలుదేరాడు మొన్న.

అదేం శనోగాని ఈ మధ్య రాబడి పూర్తిగా తగ్గిపోయింది. జనాల్లో ఏదో మార్పు కనిపిస్తోంది. పెద్ద హోటల్లో గది తీసుకొని వుండే వాళ్ళ దగ్గరకెళ్ళి చెయ్యి చూపిస్తున్నారుగాని తనలా స్టేషన్ దగ్గరగాని, మార్కెట్టు దగ్గరకాని గుడ్డ పరచుకొని కూర్చున్న వాళ్ళదగ్గరకు రావటం లేదు. తన రాత అంతేనేమో! తన చేతి రాత కూడా తెలియని ఆ హస్త రేఖా శాస్త్రజ్ఞుడు నిట్టూర్చాడు

తెల్లవారక ముందే బయలుదేరాడు. జనంరాక ముందే గుడ్డ పరచి కూర్చున్నాడు.

చల్లగా వీచిన గాలి వెచ్చదనం పుజుకుంది. ఎండలో తిరగలేని పక్షులు చెట్టు నీడలో చేరాయి.

సంతలోకి ఎవరూ రాలేదు. జనం చేరలేదు. సరకులూ రాలేదు. ఆశ్చర్యం వేసి రోడ్డు మీదకెళ్ళి చూసాడు.

రోడ్డు నిర్మానుష్యంగా వుంది. బస్సులుగాని, రిక్షాలుగాని తిరగటం లేదు. ఎదురుగా కనిపించింది "నేడే ఆంధ్రా బంద్"

సంచి సర్దుకొని స్టేషన్ దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు. ఎవరైనా నలుగురు బండి దిగి రాకపోతారా? చెయ్యి చూపించుకోక పోతారా?

బీదవాని చేతిలో రూపాయి బిళ్ళలా సూర్యుడు కరిగిపోయాడు. చీకటిలో నించి వచ్చిన చల్లగాలికి నిద్ర పట్టేసింది.

మెలుకువ వచ్చి చూసేడు. బాగా పొద్దెక్కినట్లుంది. ఒక రోజు యింటికి వెళ్ళలేదనే నిజం గుర్తుకొచ్చింది. పాపం పార్వతి తన రాక కోసం చూసి చూసి నిద్రపోయి వుంటుంధి. పార్వతి అతని భార్య.

నాలుగు డబ్బులు చేసుకోకుండా వెళితే ఎలా? మొహం తుడు-చుకొని కూర్చున్నాడు.

రైళ్ళు వొచ్చాయి. పాసింజర్లు దిగారు, వెళ్ళారు గానీ ఏ ఒక్కరు కూడా తమ అదృష్టం తెలుసుకోవాలని అనుకోలేదు.

సూర్యుడు చాలా నీరసించాడు. జనసాంద్రత తగ్గిపోయింది.

కాళీ సంచీ చంకకు తగిలించుకుని నడిచేడు. ఈ రోజన్నా యింటికి వెళ్ళకపోతే ఎలా?

"ఏంటి గురూగారూ ఆడ కూర్చున్నారు?" తల ఎత్తి చూసేడు ఎదురుగా వున్నాడు దేవుడు. అతని ప్రక్కనే అతని చెరుకు రసం బండి. "బాగా అలసి పోయి నట్టున్నారు. త్రాగండి." ఒక గ్లాసు నిండా చెరుకు రసం పోసి యిచ్చాడు దేవుడు.

"ఎలా వుంది నీ వ్యాపారం?" గ్లాసందు కొంటూ అడిగాడు.

"అంతా తమ దయేనండి బాబు నా చెయ్యిచూసి తమరన్నారు గదండీ నాకూ మంచి రోజులొస్తాయని, ఇదిగో ఈ బండి వేస్తున్నాను. రోజుకో పదో పదిహేనో తెచ్చుకుంటున్నాను!"

నవ్వు వచ్చింది! తను చెప్పేది ఏమి వుంది. కాలం కలిసొచ్చింది. బాగు పడ్డాడు. ఎవరి చెయ్యి చూసినా తొందరలో అదృష్టం కలిసి వస్తుందని చెప్పటం అలవాటు. ఆ మాట విని సంతోషంతో ఏదో పడేస్తారని.

"ఏంటి గురూగారూ ఆలోచిస్తున్నారు? మీ బాబు గురించా? బాబుకేం భయంలేదులెండి"

తుళ్ళిపడ్డాడు.

"బాబు కేమయింది?"

"ఇంకేం భయం లేదు లెండి. డాక్టరుగారు చెప్పేసారు గదా? కొంచెం ఎక్కువగా విరోచనాలు అయేయి గదండి. కళ్ళు తేలేసాడు."

ఒక్క వుదుటున లేచి నించున్నాడు. "పద దేవుడు" అంటూ అడుగులు వేసాడు. కాళ్ళలోకి ఎక్కడ లేని బలం వచ్చింది.

దూరం నించే పార్వతి కనిపించింది, బాబుని వొళ్ళో పెట్టుకొని తన రాక కోసమే రోడ్డు వేపుచూస్తూ.

చాలీ చాలని నూనితో వెలుగుతున్న దీపపు వెలుగులో ఆమె మొహం కనిపిస్తోంది.

భర్త రాక చూచి బాబు నెత్తుకొని దీపపు వత్తిని ఎగదోసింది.

"బాబు కేమయింది? ఇప్పుడెలా వుంది?"

"ఇప్పుడు బానే వుంది లెండి."

చాప మీద పడుకోపెట్టి అతని గొడుగు, సంచి అందుకుంది. సంచి లోపల పెట్టి భర్త మొహంలోకి చూసింది. ఆమెమొహంలోని దైన్యం ఆ చీకటిలోనూస్పష్టంగా కనిపిస్తోంది.

పార్వతి తెచ్చిన నీళ్ళతో మొహం, కడుగుకొని బాబు దగ్గరకెళ్ళి కూర్చున్నాక, దీపం దగ్గరకు జరిపి, పార్వతి భర్త దగ్గరకు వచ్చి "ఏమండి నేనొక మాటడగనా?"

"ఊఁ"

"ఏమండీ మీరు చెయ్యి చూసి చెప్తే చెప్పినట్లు జరుగుతుందని అందరూ అంటుంటారు గదండీ? నా చెయ్యి చూసి చెప్పండి- నా కెప్పుడు మంచి రోజులొస్తాయో?"

తన భార్య ప్రశ్నకి ఏం జవాబు చెప్పాలో ఆలోచించే లోగా అప్పుడే వీచిన గాలి ఆ దీపాన్ని మింగేసింది.

(ఆంధ్రజ్యోతి వారపత్రిక 29-4-88 సంచికలో ప్రచురితం).

* * *